కవితా కౌముది

# అందం

తుర్లపాటి రామానుజరావు

పాల వెన్నెలను
పసుపు రంగును మేళవించి
చిగురాకుల నేవళాన్ని కలగలిపి
పోతపోసిన శిల్పకళా సృష్టి
అందం!
అనుభూతి రాసుకున్న
చక్కని కవితలో
మృదుమధుర భావన
అందం!
అలసిసొలసిన కళ్ళను
మెత్తని పూల చెండుతో తడిమి
మధురమైన కలలు రాసే
చిత్రలేఖనం
అందం!

నయగారాల
ఆనంద లహిరిలో
చిరునవ్వుల ఆహ్లాదాలను
స్వాగతించే
పూలమాల
అందం!
వయసు వడగాలికి
పండిన ఆకులా
మరురోజు వాసన చూసి
వడిలిన మల్లెలా
కాలంలో మునిగి పోతూ
అందం!
మనసు చేరిన
జ్ఞాపకాల ఒడ్డుకు
పూలతావినే
మిగిల్చి పోతుంది ..!!
(అందంగా వుండటానికై జీవితాలు పణంగా పెట్టిన
నటీమణులను గుర్తుచేసుకుంటూ )



## కవలలు
## వారాల ఆనంద్

పాతదేదీ
ముగిసినట్టు లేదు,
కొత్తదేదీ
మొదలయినట్టూ లేదు,
ఇవ్వాల్టి రోజేమో
నిన్నటికి కొనసాగింపు,
రేపేమో
ఈ రోజుకు హామీ పత్రం!

★ ★ ★

రాత్రికి
ముందుమాట సాయంత్రం,
చీకటికి
చివరి పేజీ ఉషోదయం,
కాలానిదేముంది
వెలుగు నీడల సయ్యాట!

★ ★ ★


నీడలు
రూపొందుతాయి
కొనసాగుతాయి
మాయమవుతాయి!
కానీ నాతోనే ఊపిరి పోసుకున్న నీడను
నేను దాటలేను
నువ్వూ అంతే!
కవిత్వమూ కన్నీళ్ళ లాగే
నేనూ నా నీడా కవల పిల్లలం..!!

★★★

## ఇంతేనా!?
## చంద్రశేఖర్

శుభోదయం పలక వలసిన సూర్యుడు
బాధ్యత మరిచి కుంతితో విహరిస్తున్న వేళ,
ఉదయపు తూరుపు గాలుల్లో మెలిసిపోయిన వింత పరిమళాలు
అద్భుత ప్రణయ రంగానికి వేదిక ఐనందులకేమో
పక్క దుప్పట్ల మిడిసి పాట్లు!
ప్రణయాగ్ని జ్వాలల్లో రగిలిన ప్రేమ మూర్తులను
సేద దీర్చిన దిండు గలీబు రాజ దర్పం,
మత్తెక్కించే మత్స్యగంధి సువాసనలకు నిశ్చేష్టులైన వీచికలు!
ఇహమూ,పరమూ న భూతో , న భవిష్యతి అన్నట్టుగా సాగిన
రాసలీల!
నిట్టూర్పుల వేడిని ,వలపుల భారాన్ని మోయలేక చతికిల పడ్డ
పట్టె మంచం!
రాకుమారి కోసం వెతుకుతూ రాకుమారుడు,
ఆలస్యంలోని విసుగును తలుపు పై ప్రదర్శిస్తున్న పని మనిషి!
షిట్ రోజూలా ఇదీ ఒక కలేనా ? అని లేవలేక లేస్తున్న నేను..!!

★★★



# గర్జించే నలభైలు

డా.కె.గీత

నలభైలు
కంటికింద నల్ల చారికలు గానూ
మోకాలి నొప్పులుగానూ
తల మీద పొడుచుకొచ్చే తెల్ల వెంట్రుకలుగానూ
మొదలవుతాయి
నలభైలు
జీవితపు బరువు బాధ్యతల్నే కాదు
ఒంటి బరువును కూడా పెంచుతాయి
ముందు చూపు మిగుల్చుస్తూనే
కంటి చూపుని మందగిస్తాయి
కుదురైన ఉద్యోగం
కలగన్న జీవితం
స్థిరమైన జీతం
సరిపడా భత్యం
అయినా
లోటుబడ్జెట్టు రొక్కం
పొంతన చిక్కని చిక్కం
పెరిగే పిల్లల్తో బాటూ
పెరుగుతున్న అప్పులు
పెరిగిన అవసరాలకు
పెరగని తెలివితేటలకు
మధ్య నలుగుతూ
పదునుదేరుతాయి నలభైలు
రాళ్లు తిని అరాయించుకున్న
యవ్వనం స్థానే
అల్సర్ ల ప్రాధత్వం
బద్ధకాల జీవితంలో
బీపీలు
కాళ్లు సాగని ఉద్యోగాలతో
షుగర్లు

నలభైలకే
అరవైల పాలబడుతున్న
పరుగుల జీవితాలు
ఇరవైల్లో తొలి ప్రేమ
ముప్పైల్లో పాకానబడి
నలభైల్లో పరిపక్వమవుతుంది
లోకమెరుగని అమాయకత్వాలు
అసహాయతల ఎదురీతలు - పడిలేచే పదును క్షణాలు
గుండె చాటున గుక్కపట్టాల్సిన దుఃఖాలు
మూడో కన్నెరుగని మూగబాధలు
ఎన్నెన్నో దాటుకొచ్చిన
జీవితంలో
నలభైల కాలం
రోజులు సుఖవంతమవుతాయని
పనులన్నీ ఫలవంతమవుతాయని
మిణుకుమనే ఆశల్ని మట్టుబెడుతూ
శరీరం రోగాల దుప్పటిని దులిపి
మందుల మందుపాతరేస్తుంది
అప్పుడప్పుడే స్థిరపడుతున్న
నలభైల వెంట గర్జిస్తూ
గడగడలాడించే జీవితం
ఉరుమై విరుచుకుపడుతూ -
ఉక్కుపాదాన అణచివేస్తూ -
అయినా
నలభైలు యాభైలు - యాభైలు అరవైలు కాకతప్పని
ఆరోహణ జీవితంలో
నలభైలు గర్జించినా - జీవితాన్ని గర్జించలేని
పరమపథసోపానంలో
నవ్వు ముసుగు మొహాన తగిలించుకుని
మేకపోతు గాంభీర్యాన్ని గుండెకి వేళ్లాడదీసుకుని
ఒక్కో వత్సరమూ ముందడుగేయాల్సిందే

-----

# లేఖరాయాలని.. సుజాత పి.వి.ఎల్

లేఖ రాయాలని వుంది,
మనసు మడతలు విప్పి,
చేతులతో మూసిన ముఖాన్ని
అద్దంలా నీ ముందుంచి,
ఏవేవో రాయాలని వుంది!
ఏ జన్మ బంధమో ఈ జన్మలో
కలిశామనే సంతోషాన్ని రాశి పోసినట్టుగా,
అక్షరాలను నెమలీకతో అద్ది
ఇంపుగా రాయాలని వుంది!
నీ సమక్షంలో నేను గడిపిన క్షణాలన్నీ
ఒక్కొక్క జ్ఞాపకంగా మలచి,
అందంగా అత్తరు పూసి
ముత్యాల సరాలు కూర్చినట్టుగా
రాయాలని వుంది.!
నువ్వు నన్ను సుతిమెత్తగా తాకినప్పుడు,
వణికే పెదాలను బిగబట్టుకొని
భయాన్నీ బిడియాన్నీ కలబోసి
కనుపాపలలో కలిగిన భావాన్ని
సుగంధ పరిమళాలు వెదజల్లినట్లు
రాయాలని వుంది!
ఎన్నో ఇంకెన్నో రాయాలని వుంది
లేఖ చివర నా పేరుని నీ పేరుతో కలిపి
నువ్వు నా సొంతమని లోకానికి తెలిపేలా
ఓ లేఖ రాయాలని వుంది...!!

★★★

# స్వ-అరూపం

ఎస్.ఆర్.బందా

పట్టుకోగలవేమో చూడు పాత కాగడాతో
సన్నని గులాబీ వ్రేళ్లు నొక్కినప్పటి నొప్పి -
తడి కొండల మీది నీలి మబ్బుల్ని
తడిమినప్పటి తృప్తి -
రహస్యం దాచుకున్న చీకటి లాకర్లోకి
తొంగిచూసుకున్నప్పటి జ్ఞప్తి -
మునిగి - ఈదగలవేమోచూడు ప్రాణవాహినిలో
తీరుతుందేమో ఇప్పటి నీ దప్పి-

ఇప్పుడు కరచాలనాలు చేస్తున్నట్లు లేదు
వ్రేళ్లకు మొలిచిన కాక్టస్‌లు పెరిగి
అప్పుడప్పుడూ బొక్కబోర్లా పడుతున్నావ్ సరే -
సరదాగా నవ్వుకుంటున్నట్లు లేదు
అప్పుడెప్పుడో బోర్లా పడుకున్నందుకు

రెండు చెవుల మధ్యా పరుచుకునే పేషేవర్★ నవ్వులు
పదే పదే ప్రాక్టీస్ చేసినట్లుంది
పెదవులపై ఎండి బీట్లిచ్చిన
తేనెచారికల క్రిందినుంచి చేదు
నల్ల నిజం బయటపడుతోంది మరి
¬
ఉపసంహారంలో మళ్లీ
ఏ చివారు కొమ్మమీదో ఎక్కినప్పుడు
కాసిన్ని పాతమల్లెలు చల్లుకో తలమీద!

★Professional

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి


ఏల జీవించితివని ప్రశ్నింతురెవరో
ఏమి సాధించితివని బాధింతురెవరో
ఇంత కాలమీ పృథివి జీవించి యుంటి
బ్రతుకు పొలిమేర నేడు కన్పట్టుచుండె

చక్కనైనది గడపిన శైశవమ్ము
తల్లిదండ్రుల యతులవాత్సల్యమందు
బాల్యమన్నచో మధురానుభవమె యద్ది
జగడములు లేని ప్రాణనేస్తములె గుర్తు

యౌవనమ్మున మది ప్రేమభావమయము
ధరణి యెల్లను దివ్యసౌందర్యమయము
తనను మరచెడు హృదయమ్ము త్యాగమయము
రాగసంయుతమై తోచు ప్రకృతి యెల్ల

నడివయస్సునందు గృహానందమయము
ఎడద యెల్లను సతము సంతృప్తి నిండు
ఇంతకన్నను నేమి సాధింపవలయు
ఇంత బ్రతుకునకర్థమింకేమి వలయు

యశధనాదులకై ప్రాకులాడు వారు
ఎందుకో యెరుగక పరుగెత్తు వారు
కరగిపోనిచ్చెదరు తమ కాలమెంతో
వ్రేళ్ళ సందున జారు జీవితజలమ్ము



చిత్రం:కె.రామ్మోహన్

COMMENTS